ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★ ఆదివారం 18 ఆగస్టు 2024



కోల్‌కతా ఘటనపై వైద్యుల ఆందోళనలు 8

ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ : కలెక్టర్ 8

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

- సుల్తానాబాద్ కోర్టు న్యాయమూర్తి గణేష్



మాట్లాడుతున్న న్యాయమూర్తి గణేష్

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 17: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి బాగా చదువుకోవాలని సుల్తానాబాద్ కోర్టు న్యాయమూర్తి డీ గణేష్ అన్నారు. మండలంలోని మల్యాల గ్రామ పరిధిలో గల ఆదర్శ పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆ పాఠశాల విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మిమ్ములను చదివిస్తున్నారని, ఉన్నత చదువులు వరకు బాగా చదివి అత్యున్నత ఉద్యోగాలలో మీరు ఉండాలన్నారు. తమ పిల్లలు బాగా చదువుకొని పెద్ద కొలువులలో ఉంటే తల్లిదండ్రులకు సంఘంలో మీ వలన గౌరవం ఏర్పడుతుందన్నారు. దుర అలవాట్లను దూరం చేసుకొని చదువుపైనే శ్రద్ధ వహించి విద్యాబుద్ధులు నేర్పే గురువులను గౌరవించాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం ఏర్పడాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే అనారోగ్యాలకు గురై తల్లిదండ్రులకు బాధలు మిగిలించిన వారవుతారని వివరించారు. ఎందరో డ్రగ్స్‌కు అలవాటు పడి వారి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని, అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఏదైనా వాహనం నడిపేటప్పుడు వాహనంతో పాటు వాహనం నడిపే వారికి కూడా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించి అన్ని పత్రాలు ఉండాలన్నారు. వాహనాలను నడిపే డ్రైవర్లు అతివేగంగా వాహనాలను నడిపి ప్రమాదాల మీదికి తెచ్చుకోకూడదని పేర్కొన్నారు. మంచి నూతన సమాజ నిర్మాణం కోసం ప్రతి విద్యార్థి తన బాధ్యతగా భావించాలన్నారు. మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని, బాగా చదివి తల్లిదండ్రులకు, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలి సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఓంకార్‌యాదవ్, న్యాయవాదులు పీ శ్రీరాములు, జే రమేష్, ఆకారపు సర్వోత్తమ్‌రెడ్డి, కే అజయ్, పాఠశాల ప్రిన్సిపాల్ జే శ్రీనివాస్ ఉపాధ్యాయని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రామగుండంలో ట్రాఫికర్

- పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్
- బీవోటీ పొంది పత్తాలేని ఏజెన్సీ
- అడ్వర్‌టైజ్‌మెంట్లపై వసూళ్లు.. సిగ్నల్స్ నిర్వహణ గాలికి..
- కూడళ్లలో ప్రమాదాలు
- స్పందించని నగరపాలక సంస్థ





మున్సిపల్ ఆఫీస్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్

కోల్‌సిటీ, ఆగస్టు 17: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ కొన్ని రోజులుగా పనిచేయడం లేదు. సిగ్నల్స్ నిర్వహణ చేపట్టాల్సిన ఏజెన్సీ పట్టించుకోవడం లేదు. పోలీస్ యంత్రాంగం సమాచారం ఇచ్చినా స్పందించని పరిస్థితి. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు 2018లో నగరపాలక సంస్థ బిల్డ్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్(బీవోటీ) ప్రాతిపదికన అప్పగించేందుకు ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్(ఈవోఐ)ని పిలిచింది. ఇందుకు నగరపాలక సంస్థ పరిధిలో వివిధ ప్రాంతాల్లో అడ్వర్‌టైజ్‌మెంట్ స్ట్రక్చర్స్ ఏర్పాటు చేసుకుని అందుకు ప్రతిగా కార్పొరేషన్‌లోని వివిధ ప్రాంతాల్లో సిగ్నల్స్ ఏర్పాటు చేసి నిర్వహించాలని ప్రతిపాదించారు. రాజీవ్ రహదారిపై మున్సిపల్ ఆఫీస్, బస్టాండ్, టీవీఎస్ షోరూమ్, మెయిన్ చౌరస్తాలో నాలుగు వైపులా, మున్సిపల్ కాంప్లెక్స్, చౌరస్తా-రాంమందిర్ రహదారిలో ఒక చోట ఈ బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పటి యంత్రాంగం ఈవోఐ పేర స్టాండ్ పవర్ టెక్నాలజీకి 17ఏళ్ల కాలపరిమితిపై ఈ బీవోటీ ఇచ్చింది. వివిధ ప్రాంతాల్లో అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డులు ఏర్పాటు చేసుకుని 12చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్, బ్లింకర్స్ నిర్వహించాలని నిబంధనలు పెట్టారు. మున్సిపల్ ఆఫీస్, ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డు, మేడిపల్లి చౌరస్తా, రాజేష్ థియేటర్, టీవీఎస్ షోరూమ్, మిలినియం క్వార్టర్స్, గంగానగర్ వంతెన ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. వీటితో పాటు పలుచోట్ల సోలార్ బ్లింకర్స్ కూడా ఏర్పాటు చేయాలని ఈవోఐలో ఉంది.

● పెండింగ్ అప్రూవలే.. కౌన్సిల్ ఆమోదమే లేదు

మున్సిపల్ చట్టం ప్రకారం బీవోటీలకు స్టాండింగ్ కౌన్సిల్, మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి. 2018లో జరిగిన ఈ బీవోటీకి పెండింగ్ అప్రువల్ ఇచ్చి స్టాండింగ్ కౌన్సిల్‌లో పెట్టా లని అప్పటి మేయర్ సూచించారు. దీన్ని స్టాండింగ్ కౌన్సిల్‌కు కూడా తీసుకురాలేదు. కౌన్సిల్ అనుమతికి అసలే రాలేదు. నిబంధనల ప్రకా రం బీవోటీ చెల్లుబాటు అయ్యే అవకాశాలే లేవు.

అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డులపైనే శ్రద్ధ...

బీఓటీ తీసుకున్న సదరు సంస్థ కేవలం అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డుల నిర్వహణ, వ్యాపారంపైనే దృష్టి సారిస్తుంది. నగరంలో కొన్ని చోట్ల ఈ బోర్డులు పెట్టేందుకు బీఓటీలో అనుమతి లేదు. అయినా చౌరస్తాలో నాలుగు చోట్ల పెట్టారు. ఈ బోర్డులపై వ్యాపారం చేస్తున్న సదరు ఏజెన్సీ ట్రాఫిక్ సిగ్నల్స్ నిర్వహణ మాత్రం పట్టించుకోవడం లేదు.

● ట్రాఫిక్ నియంత్రణ అస్తవ్యస్తం..

రామగుండం నగరపాలక సంస్థలో ఐదు రోజులుగా ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేయడం లేదు. దీంతో మున్సిపల్ జంక్షన్, ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు, మేడిపల్లి చౌరస్తా, రాజేష్ టాకీస్ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా రాజీవ్ రహదారిపై సిగ్నల్స్ పని చేయక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై రామగుండం నగర పాలక సంస్థ స్పందించడం లేదు.

ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేయక ప్రమాదాలు

- ఈదునూరి శంకర్, రామగుండం యువ మిత్ర సేవామిత్ర



రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో పలు కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై నగరపాలక సంస్థ వెంటనే చర్యలుచేపట్టాలి. బీఓటీని పునః సమీక్షించాలి. ఏజెన్సీపై చర్యలు చేపట్టాలి.

ఏజెన్సీని పిలిపిస్తాం...

- శ్రీకాంత్, కార్పొరేషన్ కమిషనర్



రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ట్రాఫిక్ సిగ్నల్స్ నియంత్రణపై సంబంధిత ఏజెన్సీకి సమాచారం ఇచ్చి పిలిపిస్తాం. గతంలో పోలీస్ శాఖ సమన్వయం చేసింది. బీవోటీ నిబంధనలు పరిశీలించి అవసరమైన చర్యలు చేపడుతాం.

18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్చాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 17: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటరు జాబితాలో చోటు కల్పిస్తూ పకడ్బందీగా రూపొందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్ సీఈవో కార్యాలయం నుంచి అదనపు సీఈవో లోకేష్ కుమార్‌తో కలిసి ఓటరు జాబితా సవరణ 2025పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ 1 జనవరి, 2025 ప్రామాణికంగా ఓటర్‌జాబితా సవరణ 2025 కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఓటరు జాబితా నమోదు ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18 వరకు ప్రీ రివిజన్ నిర్వహించి ముసాయదా ఓటరు జాబితా విడుదల చేయాలని, 28 నవంబర్ 2024 వరకు సదరు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని, రెండు శనివారాలు, ఆదివారాలు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని, 28 డిసెంబర్ 2024లోగా అభ్యంతరాలను, ఓటర్ క్లెయిమ్స్‌ను పూర్తి స్థాయిలో పరిష్కరించి, 06 జనవరి 25న తుది ఓటరు జాబితా రూపొందించాలని తెలిపారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18 వరకు బూత్‌స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వారిగా ఇంటింటికి తిరుగుతూ ఓటరు ధ్రువీకరణ చేపట్టాలని, ఓటరు జాబితాలో అవసరమైన చోట పాత ఫొటోలను తొలగించి ఓటర్ల నూతన ఫొటోలు అప్లోడ్ చేయాలని, 1 జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు చేయాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఉన్న లాజికల్ పొరపాట్లు, డెమో గ్రాఫికల్ పొరపాట్లను పూర్తి స్థాయిలో సవరించాలని అధికారులను ఆదేశించారు మరణించిన ఓటర్ల వివరాలను, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలను ఓటర్ జాబితా నుంచి ఫారం 7 ద్వారా తొలగించాలని అన్నారు. 1500 మంది ఓటర్లకు మించి ఉన్న పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేయాలని, అవసరమైన చోట నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని ఆయన పేర్కొన్నారు. ఓటర్ జాబితాలో ఉన్న మల్టీ ఎంట్రీలను తొలగించాలని, అదేవిధంగా ఓటర్ కార్డుపై ఉన్న పొరపాట్లు పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 79 వేల 822 ఫారం 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సీఈవో ఆదేశించారు. ఓటరు నమోదుకు సంబంధించి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం వారిగా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేయాలని సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ఓటరు నమోదు కార్యక్రమానికి సంబంధించి జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతి నిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో రెవెన్యూ డివిజన్ అధికారులు బీ గంగయ్య, వీ హనుమానాయక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు మూడు నెలల్లో పరిష్కరించాలి

- కార్పొరేషన్ ఆదాయం పెంచే దిశగా కార్యాచరణ - కలెక్టర్ కోయ శ్రీహర్ష



హాస్టల్‌లోని వంట గదిని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష



లక్ష్మీపురంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై పరిశీలన జరుపుతున్న కలెక్టర్

కోల్‌సిటీ, ఆగస్టు 17: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను మూడు నెలల్లో పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. శనివారం నగరపాలక సంస్థ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. స్థానిక 14వ డివిజన్ పరిధిలోని లక్ష్మీపురంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు వివరాలను క్షేత్రస్థాయిలో మొబైల్ యాప్‌లో నమోదు చేసే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు నెలల్లో దరఖాస్తులు పరిశీలించాలని, ముందుగా దరఖాస్తుల పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం రమేష్‌నగర్‌లోని జ్యోతిరావుపూలే బాలికల విద్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించారు. మరో భవనంలోకి హాస్టల్‌ను మార్చాలని అధికారులను ఆదేశించారు. గురుకులాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కార్పొరేషన్ సహకరించాలన్నారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో జరుగనున్న పనులను త్వరగా గ్రౌండింగ్ చేయాలని, నూతనంగా నిర్మించనున్న రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించి నిర్దిష్ట ప్రణాళిక ఉండాలన్నారు. నగరపాలక సంస్థ ఆదాయం పెంచేందుకు నిర్దిష్టమైన కార్యాచరణ అమలుచేయాలని, ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) అరుణ శ్రీ, కమిషనర్ శ్రీకాంత్, ఎస్ఈ శివానంద్, ఈఈ రామన్, అసిస్టెంట్ కమిషనర్ రాయలింగం, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీహరి ఉన్నారు.

హెల్త్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించాలని కలెక్టర్‌కు వినతి

కోల్‌సిటీ, ఆగస్టు 17: రామగుండం కార్పొరేషన్‌లో కార్మికులను వేధిస్తూ అనేక అవకతవకలకు పాల్పడుతున్న హెల్త్ అసిస్టెంట్‌ను విధుల నుంచి తొలగించాలని కలెక్టర్ కోయ శ్రీహర్షకు శనివారం డీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు మద్దెల దినేష్, ఏఐటీయూసీ నాయకుడు ఎంఏ గౌస్ వినతిపత్రం అందజేశారు. శనివారం రామగుండం కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్‌కు పలు సమస్యలపై విన్నవించారు. హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కిరణ్‌ను తొలగించి పెట్రోల్, డీజిల్ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కొంత మంది ప్రజా ప్రతినిధులు హెల్త్ అసిస్టెంట్‌కు అండగా నిలబడి వారిని ప్రోత్సహించడం దుర్మార్గమన్నారు. 2020లో పారిశుధ్య విభాగ కార్మికుల కోసం ఒక సొసైటీ గ్రూపును ఏర్పాటు చేశారని, కార్మికుల అవసరాల నిమిత్తం డబ్బు పోగు చేసుకుని సొసైటీ గ్రూపును ఏర్పాటు చేసుకుంటే అందులో ఎన్ని నిధులు ఉన్నాయో, అవి ఎవరు చూస్తున్నారో కార్మికులకు తెలియదని, సొసైటీ గ్రూప్‌పై విచారణ జరిపించాలని కలెక్టర్‌ను కోరారు. కొన్ని రోజుల క్రితం పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న సూపర్‌వైజర్లను మార్చడం వల్ల డివిజన్లలో చెత్తా చెదారం పేరుకుపోయి కంపు కొడుతున్నాయని, వర్షాకాల సీజన్ కావడం వల్ల ముంపు ప్రాంతాలు చెత్తాచెదారంతో నిండిపోయాయని, కొత్తగా వచ్చిన సూపర్‌వైజర్లకు అవగాహన లేకపోవడంతో కాలనీల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకు పోతుందన్నారు. అలాగే రామగుండం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గోదావరిఖనికి మార్చాలని కలెక్టర్‌కు విన్నవించారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై సదస్సు

సుల్తానాబాద్, ఆగస్టు 17: సీజనల్ వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని, దాంతో పాటే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గర్రెపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుదీప్ అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయంలో శనివారం బాలికలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. దాంతో పాటు అనారోగ్యంగా ఉన్న పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి తగిన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వాణిశ్రీ, కిరణ్, ప్రిన్సిపాల్ గిరిజ తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ బంద్



ఖనిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కోల్‌సిటీ, ఆగస్టు 17: బంగ్లాదేశ్‌లో మైనార్టీలుగా ఉన్న హిందువులపై దాడులు నిరసిస్తూ రామగుండం పారిశ్రామిక ప్రాంత హిందు సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం గోదావరిఖని పట్టణంలో బంద్ నిర్వహించారు. హిందు సంఘాలు, 25 వివిధ సామాజిక సంఘాలు, రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కళ్యాణ్‌నగర్‌లోని రాజస్థాన్ భవన్ నుంచి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వ్యాపారులు, వివిధ వర్గాల ప్రతినిధులు స్వచ్ఛందంగా బంద్ ర్యాలీలో పాల్గొన్నారు. గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో మానవహారం నిర్మించి బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ముక్తకంఠంతో ఖండించారు. అనంతరం జరిగిన సభలో వివిధ వర్గాల ప్రతినిధులు మాట్లాడారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, హిందు వాహిణి, పలు సంఘాల ప్రతినిధులు కందుల సంధ్యారాణి, సోమారపు లావణ్య, మేరుగు హన్మంతుగౌడ్, మహంకాళి స్వామి, కోట రవి, తోడేటి శంకర్‌గౌడ్, అయోధ్య రవీందర్, అడిగొప్పుల రాజు, బాలసాని స్వామిగౌడ్, బండారి రాయమల్లు, శ్రీధర్, కిశోర్, రాజేష్ శర్మ, సునీల్, మేరుగు గట్టయ్య, లాలా శర్మ, గౌళికార్ రాము, కోమళ్ల మహేష్, ప్రశాంత్, పాలడుగు కనకయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

మంథనిలో..

మంథని, ఆగస్టు 17: బంగ్లాదేశ్‌లో హిందూలపై హత్యాకాండకు నిరసనగా మంథనిలో హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం బంద్ నిర్వహించారు. బంద్‌లో పట్టణంలోని వ్యాపార, వాణిజ్య సంస్థలు పాల్గొన్నాయి. వీధుల గుండా ర్యాలీ నిర్వహించిన ఐక్య వేదిక నేతలు హిందూలపై జరుగుతున్న దాడులను ఖండించారు. ఈకార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక నేతలు పాల్గొన్నారు.

రామగుండంలో పట్టణ ప్రగతి పనులు రద్దు

- మొదలు పెట్టని పనులు రద్దు చేసేందుకు కలెక్టర్ హామీ

కోల్‌సిటీ, ఆగస్టు 17: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో పట్టణ ప్రగతి నిధులతో మొదలు కాని పనులు రద్దు కానున్నాయి. పట్టణ ప్రగతి పనులకు బిల్లులు రావడం లేదని, వాటిని రద్దు చేయాలంటూ శనివారం నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లు కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. నిధులు లేకుండానే పనులు కేటాయించారని, దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. మొదలు కాని పట్టణ ప్రగతి పనులను కౌన్సిల్‌లో పెట్టి రద్దు చేయిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కాగా కార్పొరేషన్‌లో రూ.5కోట్ల వరకు పట్టణ ప్రగతి పనులు ఉన్నాయని, ఇందులో సుమారు రూ.2.5కోట్ల విలువైన 15 పనులు ప్రారంభం కాలేదు. మరో 20 నుంచి 25 పనులు మొదలుపెట్టి కాంట్రాక్టర్లు మధ్యలో ఆపివేశారు. ఇందులో సీసీ రోడ్ల పనులే ఎక్కువగా ఉన్నాయి. కొందరు కాంట్రాక్టర్లు పార్ట్ బిల్లులు కూడా తీసుకున్నారు. ఈ పనులను సైతం రద్దు చేయాలని కాంట్రాక్టర్లు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. రామగుండం నగర పాలక సంస్థకు గత ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతి పనులు మంజూరు చేసి నిధులు విడుదల చేయలేదు. నగరపాలక సంస్థకు రావాల్సిన స్టాంప్ డ్యూటీ, మ్యుటేషన్ ఫీజులు, ఎంటర్‌టైన్‌మెంట్ ఫీజును ప్రభుత్వం మళ్లించుకుని పట్టణ ప్రగతి ద్వారా నిధులు విడుదల చేస్తామని పేర్కొంది. కానీ నిధుల మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ ఇవ్వడంతో నగరపాలక సంస్థ టెండర్లు నిర్వహించింది. రెండేళ్లుగా నిధులు విడుదల కలేదు. దీంతో కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

అత్యాచార నిందితులను శిక్షించాలి

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 17: కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం పరిపాలనను గాలికి వదిలివేశారని, నీట్ పేపర్ లీకులు, అత్యాచారాలు, సీపీఏ అమలు లేకపోవడం, డ్రగ్స్ గంజాయిలు విచ్చలవిడిగా పెరిగిపోవడం, విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడం జరిగిందని ఆరోపించారు. దేశాన్ని పరిపాలించడంలో మోదీ పూర్తిగా విఫలమయ్యారని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన విద్యారంగానికి సంబంధించిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేయాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రీతం, మచ్చ రమేష్, సంగె రాహుల్, ఆవునూరి అరవింద్, గొడిసెల ప్రణీత్, ఎల్కపల్లి వెంకటసాయి, కృష్ణ, శ్రీకాంత్, నాని పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్ : కలకత్తా ఆర్జీకర్ మెడికల్ కాలేజీలో డాక్టర్‌పై జరిగిన అత్యాచారం ఘటనకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు నారగోని డిమాండ్ చేశారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. వైద్య వృత్తిదారుల భద్రతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. వైద్యుల రక్షణకు, మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల నిరోధానికి అవసరమైతే చట్టసవరణ చేయాలన్నారు. వైద్య సంస్థల్లో మెరుగైన భద్రతా చర్యలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలని, నేరస్తులకు శిక్ష పడేలా అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నాయకులు గుండేటి రాజేష్,మంథని రఘు, నోమూరి శ్రీధర్,మడిపల్లి బాపయ్య, రవి చిగురు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పేద రైతులకు పవర్ స్ప్రేయర్స్ పంపిణీ

సుల్తానాబాద్, ఆగస్టు 17: సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన పలువురు పేద రైతులకు తాళ్లపల్లి ఆగయ్య ఫౌండేషన్ వారు ఉచితంగా పవర్ స్ప్రేయర్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మనోజ్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంథని, ఆగస్టు 17: ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్ కారణంగా మంథని పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మల్లయ్య శనివారం తెలిపారు. పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఏరియా, పెంజేరుకట్ట, దొంతులవాడ, నడివీధి, మండాట, సుభాష్‌నగర్, పోచమ్మవాడ ప్రాంతాల్లో కరెంట్ ఉండదని వెల్లడించారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

మంథని రూరల్, ఆగస్టు 17: మండలంలోని సిద్ధిపల్లి వద్ద ఆటో ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాలీలో తరలిస్తున్న బియ్యాన్ని మంథని పోలీసు స్టేషన్ అప్పగించి నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. సివిల్ సప్లై అధికారుల ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ అంజి, మరో వ్యక్తి రమేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కారు నుంచి దట్టమైన పొగలు

భయభ్రాంతులకు గురైన వాహనదారులు



కారు నుంచి వస్తున్న పొగలు

జమ్మికుంట, ఆగస్టు 17: పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నుంచి హుజూరాబాద్ వెళ్తున్న ఓ కారు నుంచి శనివారం ఒక్కసారిగా దట్టమైన పొగలు వెలువడ్డాయి. దీంతో కారులో ఉన్న వారు భయపడి కిందకు దిగి దూరంగా వెళ్లారు. కారు సమీపంలో ఉన్న వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. ఇంజన్ నుంచి పొగలు వస్తుండటంతో కారు పేలుతుందనే భయంతో పరుగులు పెట్టారు. కాసేపటికి పొగలు తగ్గడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

చక్రాలు ఊడి పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

తప్పిన ప్రాణాపాయం

జగిత్యాలరూరల్, ఆగస్టు 17 : నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుకు శనివారం పెనుప్రమాదం తప్పింది. శనివారం జగిత్యాల బస్టాండ్‌లో సుమారు 100 మంది ప్రయాణికులను ఎక్కించుకొని జగిత్యాల నుంచి ఖానాపూర్‌కు వెళ్తుంది. ఈ క్రమంలో బస్సు ప్రయా ణిస్తున్న క్రమంలో ఆకస్మాత్తుగా జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్- మోర పల్లి గ్రామాల శివారులో బస్సు డ్రైవర్ వెనుక వైపు ఉన్న రెండు చక్రాలు ఊడి పొలాల్లోకి దూసుకెళ్లాయి.. దీంతో బస్సు ఒక్కసారిగా కిందకు పడి ఒకేవైపు కుంగడంతో ప్రయాణికులు ఒక్కసారిగా కేకలు వేసి భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో బస్సులో ప్రయాణిస్తున్న 100 మందికి ఎలాంటి ప్రమాదం కాలేదు. దీంతో బస్సులో ఉన్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. మరో బస్సు ఏర్పాటు చేసి వారిని గమ్యస్థానానికి చేర్చారు.

పిల్లల కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్ట్

● 3.50 లక్షలకు ఇద్దరు ఆడ పిల్లల అమ్మకం ● వివరాలు వెల్లడించిన సీఐ

మెట్‌పల్లి, అగస్టు 17(ఇబ్రహీంపట్నం): ప్రియుడి మోజులో పడ్డ ఓ తల్లి తన ఇద్దరు కూతుళ్లను అమ్ముకుంది. కని పెంచిన అమ్మే ప్రియుడితో కలిసి సొంత బిడ్డలను అమ్ముకుంది. చివరికి ప్రియుడితో పాటు ఆమె కూడా కటకటాల పాలైంది. ఇద్దరినీ మెట్‌పల్లి పోలీసులు పక్కా ప్లాన్ వేసి పట్టుకుని అరెస్ట్ చేశారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా సారంగాపూర్‌కు చెందిన ఇస్లావత్ లావణ్య (జమున)కు ఎనిమిదేళ్ల క్రితం ఫకీర నాయక్‌తో పెళ్లైంది. లావణ్యకు ఇద్దరు అడపిల్లలున్నారు. రెండేళ్ల క్రితం భర్తతో విబేధాలు రావడంతో వదిలేసి ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో లావణ్య ఇబ్రహీంపట్నం మండలం కోమటి కొండపూర్‌లోని ఓ దాబాలో పని చేస్తుండగా అమ్మక్క పేటకు చెందిన ఇస్లావత్ నాగేష్‌తో పరిచయం ఏర్పడి అది వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలో లావణ్య ఇద్దరు అడపిల్లలను ప్రియుడితో కలిసి అమ్మాలని అనుకుంది. అనాథ పిల్లలని నమ్మించి మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామానికి ఆరేళ్ల బాలిక వైష్ణవిని 2 లక్షలు, మెట్‌పల్లి పట్టణంలోని హన్‌మాన్ నగర్‌కు చెందిన ఒకరికి మూడేళ్ల బాలిక కృష్ణవేణిని 1.50 లక్షలకు అమ్మింది. ఇదే క్రమంలో బాబు కావాలని ఒకరు అడుగగా 1.50 లక్షలకు డీల్ కుదుర్చుకుని పథకం ప్రకారం ఈ నెల 13న నాగేష్ మెట్‌పల్లిలోని దుబ్బవాడలో రెండేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి దొరిపోయాడు.


కిడ్నాప్‌నకు పాల్పడిన నాగేష్

నాగేష్‌ను పట్టుకున్న పోలీస్‌లు కిడ్నాప్ వ్యవహారంలో మరింత లోతుగా విచారణ చేయగా ఇద్దరు అడపిల్లలను అమ్మిన విషయం వెలుగులోకి వచ్చింది. కిడ్నాప్‌లకు పాల్పడుతున్న ఇద్దరిని పట్టుకునేందుకు సీఐ నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో మెట్‌పల్లి ఎస్‌ఐ చిరంజీవి ప్రత్యేక టీంగా ఏర్పడి గాలిస్తుండగా పట్టణంలోని చావిడి వద్ద కిరాయి ఉంటున్న ఇంట్లో ఉన్న ఇద్దరిని అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఇద్దరు చిన్నారులను శిశు సంరక్షణా కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. నాగేష్‌పై గతంలో నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, జిగిత్యాల జిల్లా మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నంలో పలు దొంగతనాలలో కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు.

21న జాబ్ మేళా

కరీంనగర్ టౌన్, ఆగస్టు 17: నగరంలోని సిటీ సెంటర్ కాంప్లెక్స్‌లో రిలయన్స్ నిప్పాన్ లైఫ్ కంపెనీ మహిళల కోసం ప్రత్యేకంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. శనివారం సంస్థ కార్యాలయంలో మేయర్ చేతుల మీదుగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 30 నుంచి 35 ఏళ్ల వయసు గల మహిళలకు ఉపాధి కల్పించేందుకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారని, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిలయన్స్ నిప్పాన్ లైఫ్ సీనియర్ మేనేజర్ మాకులూరి రాం మోహన్, మేనేజర్ సిరిసిల్ల ప్రసాద్ పాల్గొన్నారు. పూర్తి వివరాలకు 9848168440 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పర్సు దొంగిలిస్తున్న మహిళ పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 17: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక ప్రయాణికురాలి నుంచి పర్సు, సెల్‌ఫోన్‌లను ఓ మహిళ దొంగిలిస్తుండగా ఆర్టీసీ సెక్యూరిటీ పోలీసులు శనివారం పట్టుకున్నారు. బస్టాండ్‌లోని ఇన్‌గేట్ వద్ద హైదరాబాద్‌కు చెందిన శ్రుతి అనే మహిళా ప్రయాణికురాలు బస్సు దిగుతుండగా ఆమె పర్సు, సెల్‌ఫోన్‌ను విజయవాడకు చెందిన మాధవి అనే మహిళ దొంగిలిస్తుండగా ఆర్టీసీ విజిలెన్స్ సెక్యూరిటీ ఏఎస్‌ఐ ఎం.లక్‌పతి, హెడ్ కానిస్టేబుల్ ఎం.సాగర్, వై.సారయ్య, మానసలు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుబడిన మహిళ వద్ద నుంచి 3 పర్సులు, ఒక బంగారు గాజు, 42 వేల నగదును స్వాధీనం చేసుకుని, ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించామని ఆర్టీసీ సెక్యూరిటీ అధికారులు తెలిపారు.

'మిడ్ మానేరు'లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటి విడుదల

బోయినపల్లి, ఆగస్టు 17: మండలంలోని మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 4,500 క్యూసెక్కుల, మూల వాగు నుంచి 590 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 312.44 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 15.38 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. కాగా మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3,200, కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి...

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 2.13 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మధ్యమానేరు నుంచి 3600 క్యూసెక్కుల నీటిని రెండు పంపుల ద్వారా ఎత్తిపోస్తుండగా రంగనాయకసాగర్‌కు 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టు లోకి ఎగువ ప్రాంతం నుంచి 10865 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగు నీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.449 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

కాకతీయ కాలువకు కొనసాగిన నీటి విడుదల

జగిత్యాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు కాలువకు 4,200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 15,320 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 48.518 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి అవసరాలకు ప్రాజెక్టు నుంచి 5,453 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

చిన్నాన్నను కేసులో ఇరికించేందుకు యువకుడి కట్టుకథ

● కిడ్నాప్‌నకు గురైనట్లు డ్రామా ● పోలీసుల విచారణలో బయటపడిన వ్యవహారం

చందుర్తి, ఆగస్టు 17: భూ వివాదంలో ప్రత్యర్థులను కేసుల్లో ఇరికించడానికి యువకుడు అల్లిన కట్టుకథ వీడింది. పోలీసుల విచారణలో కిడ్నాప్ వ్యవహారం డ్రామాగా తేలింది. శనివారం చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ వివరాలు వెల్లడించారు. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లికి చెందిన ఎక్కలదేవి గంగరాజుకు అదే గ్రామానికి చెందిన అతడి చిన్నాన్న ఎక్కలదేవి రాజయ్యకు మధ్య కొంత కాలంగా భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. గొడవలకు సంబంధించి గంగరాజు రెండు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో తన చిన్నాన్నతోపాటు అతడి కుమారులు, మరో ముగ్గురిని క్రిమినల్ కేసుల్లో ఇరికించాలని ప్లాన్ వేశాడు. ఈ క్రమంలో గురువారం గంగరాజు అదృశ్యమయ్యాడు. అదే రోజు ఉదయం పొలం వద్ద ద్విచక్ర వాహనం, చెప్పులు షర్టు, మొబైల్ ఫోన్ చిందరవందరగా పడి ఉండడం గ్రామస్థులకు కనిపించడంతో కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందిచారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి వెంటనే గాలింపు చేపట్టారు. చుట్టుపక్కల వ్యవసాయ బావుల్లో వెతికించారు. ఆచూకీ లభించలేదు. శుక్రవారం తెల్లవారు జామున పొలం పనులకు వెళ్తున్న రైతులకు చేతులు, కాళ్లకు తాళ్లు కట్టి ఒంటిపై దుస్తులు లేకుండా, ముఖంపైనా, ఒంటిపైనా బురదతో గంగరాజు కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు లు సంఘటన స్థలానికి చేరుకుని గంగరాజును అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలిం చారు. అతడిని విచరించగా గుర్తుతెలియని వ్యక్తులు తన చేతులు, కాళ్లను కట్టేసి అడవిలో వదిలి వెళ్లినట్లు గంగరాజు పోలీసులతో కథ అల్లాడు. గంగరాజు వ్యవహారశైలిపై అనుమానం వచ్చిన పోలీసులు లోతుగా విచారణ చేపట్టడంతో కిడ్నాప్ వ్యవహారం బయటపడింది. తన చిన్నాన్న ఎక్కలదేవి రాజయ్య, అతడి కూమారులు భూమి విషయంలో జోక్యం చేసుకోకుండా ఉండేందుకు, వారిని కేసుల్లో ఇరికించి భయపెట్టేందుకు కిడ్నాప్ డ్రామా ఆడినట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మానకొండూర్, ఆగస్టు 17: మానసిక స్థితి సరిగా లేక ఓ యువకుడు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. శంకరపట్నం మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన నాయిని వినోద్‌కుమార్ (32)


వినోద్‌కుమార్ (ఫైల్)

కు మానసిక స్థితి సరిగా లేకపోవడంతో పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. శుక్రవారం పశువుల కొట్టంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వినోద్‌కుమార్ తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ ఇన్‌చార్జి మొగిలి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ఇల్లంతకుంట, ఆగస్టు 17: మండలంలోని రేపాక గ్రామానికి చెందిన మొగిలోజు రంగయ్య (70) అనే రైతు విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం రంగయ్య శనివారం వ్యవ


రంగయ్య (ఫైల్)

సాయ బావివద్ద పొలంలోని ఒడ్లు చెక్కడానికి వెళ్లాడు. అక్కడే ఉన్న విద్యుత్‌స్తంభం సపోర్టు వైరుకు తగిలాడు. సపోర్టు వైర్‌కు విద్యుత్ సరఫరా అవుతుండటంతో రంగయ్య విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మృతుడు రంగయ్య భార్య సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రయదారుల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 17: సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన ఒల్లెపు వంశీ (24), ఒల్లెపు భీంరాజ్ (20)అనే గంజాయి విక్రయదారులను శనివారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. వీరి వద్ద 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. వీరు హైద్రాబాద్‌లో గంజాయి కొనుగోలుచేసి సిరిసిల్లకు వచ్చి విద్యానగర్‌లోని వైకుంఠధామం వద్ద ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం వచ్చిందన్నారు. దీంతో అన్నదమ్ములను పట్టుకొని విచారించగా వారి వద్ద 200 గ్రాముల గంజాయి లభించిందన్నారు. వెంటనే ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు.

ఘనంగా శ్రీ భూ ఆదివరహా స్వామి కల్యాణ మహోత్సవం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కమాన్‌పూర్, ఆగస్టు 17: మండల కేంద్రంలోని ఆదివరహాస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా శనివారం జరిగింది. స్వామివారి జయంత్యుత్సవాల్లో భాగంగా వేదపండితులు కనుకుంట్ల వరప్రసాద్ శ్రీనివాసాచార్యులు, రామాంజనేయుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం జరిగింది. ఉదయం నిత్యాభిషేకం, గోపూజ, తీర్థ ప్రసాద గోష్ఠి అలాగే నిత్య పూర్ణాహుతి, తీర్థ ప్రసాద గోష్ఠి, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, నిత్య హోమం, పూర్ణాహుతి తదితర వాటిని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో కాంతారెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాదాసు రవీందర్ సుజాత దంపతులు అన్నదానం నిర్వహించారు.

అధ్యాత్మిక సంపదకు మారుపేరు భారతదేశం

ఆధ్యాత్మిక సంపదకు మారుపేరు భారతదేశమేనని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం శరణ్య పీఠాధిపతి శ్రీ బాల బ్రహ్మానంద సర్వసతి మహాస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదివరాహ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు అధ్యాత్మిక సంపదను అందిస్తున్న ఏకైక దేశం భారతదేశమన్నారు. ఆధ్యాత్మిక సంపదకు మూలాధారాలు దేవాలయాలు, గ్రంథాలు, భగవద్గీత, రామాయణం, భాగవతం, వేదాలు మాత్రమేనన్నారు. అనంతరం ఆయనను ఆలయ అర్చకులు, ప్రముఖులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈవో కాంతారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, దేవాదయ ఇన్‌స్పెక్టర్ సుజాత, ఈవో శంకర్ తదితరులు ఉన్నారు.


బాల బ్రహ్మానంద సర్వసతిని సన్మానిస్తున్న అర్చకులు, అధికారులు

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ భక్తుల రద్దీ


స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ధర్మపురి, ఆగస్టు 17: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో రెండో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు జరిపారు. అంతకు ముందు భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన అనంతరం ఆలయాలకు చేరు కుని స్వామి వారలను దర్శించుకున్నారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీని వాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ అర్చకులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరదకాలువలో పడ్డ ట్రాక్టర్ వెలికితీత



వరదకాలువలో నుంచి పైకి తీస్తున్న ట్రాక్టర్

మల్యాల, ఆగస్టు 17: రెండు రోజుల క్రితం వరదకాలువలో పడ్డ ట్రాక్టర్‌ను శనివారం వెలికి తీశారు. మండలంలోని రాంపూర్ శివారులో గురువారం ట్రేలర్‌తో పాటు ట్రాక్టర్ వరద కాలువలో పడింది. నీరు అధికంగా ఉండడంతో బయటకు తీసే ప్రయత్నాలు ఫలించ లేదు. దీంతో శనివారం ఇరిగేషన్ అధికారులు పంప్‌హౌజ్ వద్ద గల గేట్లను ఓపెన్ చేయడంతో కాలువలోని నీరు తగ్గుముఖం పట్టాయి. నీరు తగ్గి ట్రాక్టర్ తేలడంతో గ్రామస్థులు రెండు జేసీబీల సహాయంతో తాళ్లు కట్టి కాలువ పైకి తీశారు.

సంక్షిప్త సమాచారం

పాలకుర్తి : మండలం పరిధిలోని బసంత్‌నగర్‌లో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేస్తూ శనివారం బసంత్‌నగర్ వాసి తువ్వ సతీష్ యాదవ్ ఒక్క రోజు నిరాహార దీక్ష చేపట్టారు. అతడికి మద్దతుగా పలువురు గ్రామస్థులు సంఘీబావం ప్రకటించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాత గ్రామపంచాయతీ స్థానంలో కొత్త గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మాంచాలని కోరారు.

రామగిరి : మండల వ్యవసాయ అధికారిగా శ్రీకాంత్ శనివారం బాధ్యతలు చేపట్టారు. కొంత కాలంగా మండల ఇన్‌చార్జి ఏవోగా పనిచేసిన ప్రమోద్ పాలకుర్తికి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో శ్రీకాంత్ వచ్చారు.

కోల్‌సిటీటౌన్ : గోదావరిఖని సబ్‌డివిజన్ పరిధిలోని గోదావరిఖని(ఈస్ట్), (వెస్ట్), మార్కండే యకాలనీ వీజీసెంటర్ సెక్షన్లలో జూనియర్‌లైన్‌మెన్లగా పనిచేస్తున్న వారికి అసిస్టెంట్ లైన్‌మెన్లుగా ప్రమోషన్ పత్రాలను అందజేశారు. శనివారం ఏడీఈ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏడీఈ అడిచర్ల శ్రీనివాస్, ఏఈలు ఎస్.హరీష్, మహిపాల్ రెడ్డి,సంపత్‌లు పత్రాలను అందజేసి అభినందించారు. 1104 యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొవ్వూరు వెంకటరాజం, మంథని డివిజన్ అధ్యక్షులు పూర్ణచందర్, కార్యదర్శి రఘుపతి రెడ్డి, అంజన్న, అడిషనల్ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంథని : అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీలో ప్రవేశాలకు ఈనెల 31వరకు గడువును యూనివర్సిటీ పెంచినట్లు మంథని స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ కర్నాటి కృష్ణ శనివారం తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీల్లో ఓపెన్‌డిగ్రీ చేయాలనుకునే వారు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 7382929649 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.

కాల్వశ్రీరాంపూర్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఎంపిక పోటీలు ఈనెల 21నుంచి 23వరకు నిర్వహిస్తున్నట్లు మండల నోడల్ అధికారి సిరిమల్ల మహేష్ తెలిపారు. 14,17ఏళ్లలోపు బాల, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పూర్తి సమాచారానికి బండి కుమారస్వామి, 9247683220లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు బీ మణిమాల, కే కృష్ణవేణి, ఏ దుర్గాప్రసాద్, నభిం, వినోద, ఎంఐఎస్ కోఆర్డినేటర్ జే రమేష్, సీసీఓ రమేష్ పాల్గొన్నారు.

రామగిరి : మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోగే లింగయ్య(59) శనివారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన మృతదేహాన్ని చూడడానికి పెద్దసంఖ్యలో గ్రామస్తులు హాజరయ్యారు.

ఓదెల : మండలంలోని కొలనూర్ మాజీ సర్పంచ్ గీట్ల వెంకటరెడ్డి కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పరామర్శించారు. ఇటీవల మాజీ సర్పంచ్ గీట్ల వెంకటరెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కుటుంబాన్ని ఓదార్చారు. అనంతరం మృతికి కారణాలను తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఘైరి రవిగౌడ్ పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : మండలంలోని భోజన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలోని త్రివేణి రైస్ మిల్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకొని దగ్ధం కాగా శనివారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు సందర్శించారు. మిల్లులో ఉన్న వరిధాన్యం అధిక మొత్తంలో కాలిపోవడంతో అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి మిల్లు యజమానికి అండగా నిలువాలని కోరారు. సుధాకర్‌రెడ్డి, కడార్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మేకల మల్లేషం పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్, ఎంపీవో ఫయాజ్‌లను శనివారం మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎండీ.ఖాజా,మండల అధ్యక్షులు మామిడిపల్లి తిరుపతి,ప్రధానకార్యదర్శి జంగపల్లి నరేష్, కోశాధికారి బందరి అశోక్, నాయకులు ఎండి.ముస్తాఫా, రాజేశం, రమేష్, మహేందర్, రాజయ్య పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరర్ : కలకత్తా నగరంలో హత్యకు గురైనా మెడికల్ విద్యార్థి మృతిపట్ల జిల్లా కేంద్రంలోని ట్రినిటి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు కోవ్వొత్తులతో నివాళ్లు అర్పించారు. ప్రిన్సిపాల్ రాజు, వైస్‌ప్రిన్సిపాల్ సీతారెడ్డి పాల్గొన్నారు.

గోదావరిఖని : ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్‌ను శనివారం సింగరేణి కళాకారులు సన్మానించారు. కల్చరల్ కెప్టెన్ పొన్నాల శంకర్ ఆధ్వర్యంలో కళాకారులు జీఎంను సత్కరించారు. పర్సనల్ ఆఫీసర్ సారంగపాణి, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ రమేష్‌తో పాటు కళాకారులు చీకటి అంజన్న, ధార సుశీల, నేవా శ్యాం, జనగామ శ్రీనివాస్, కాంపెల్లి నర్సింగారావు, సుంక వెంకటేష్ పొన్నాల కార్తీక్, కీర్తి శేఖర్ పాల్గొన్నారు.


పెద్దపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు


ఖనిలో నిరసన తెలుపుతున్న వైద్యులు, వైద్య విద్యార్థులు

కోల్‌కతా ఘటనపై వైద్యుల ఆందోళనలు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 17: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారానికి నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు శనివారం జిల్లా కేంద్రంలో డాక్టర్లు ఓపీని నిలిపివేసి ర్యాలీ నిర్వహించారు. నిందితులను వెంటనే ఉరితీయాలని ముక్తకంఠంతో ఖండించారు. ర్యాలీలో ఐఎంఏ జనరల్ సెక్రెటరీ డాక్టర్ ప్రణీత్, సీనియర్ డాక్టర్లు టీవీ రావు, మల్లేశం, విజయ, రోహిత్, స్వరూప్ కిరణ్, రాజేందర్‌రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కావేటి రాజగోపాల్, ఫార్మాసిస్ట్ అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంట్ వినోద్, విజిత్‌రావు, హరీష్, ఆనంద్‌రావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు

కళ్యాణ్‌నగర్ : కలకత్తాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు, ప్రైవేట్ వైద్యులు, వైద్య విద్యార్థులు విధులు బహిష్కరించి ర్యాలీ నిర్వహించారు. రామగుండం ఐఎంఏ అధ్యక్షుడు దామెర అనీల్ కుమార్, క్యాస శ్రీనివాస్ మాట్లాడారు. వైద్యులకు రక్షణ కల్పించాలని, అత్యాచార నిందితులను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ వైద్యులు శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ఓపీ బంద్ పెట్టారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కూడా అత్యవసర సేవలు మినహాయించి ఓపీని నిలిపివేశారు. ర్యాలీ గాంధీనగర్, చౌరస్తా, లక్ష్మీనగర్‌గుండా కొనసాగింది. వైద్యులు విజయభారతి, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మెడికోలో ర్యాలీలో పాల్గొన్నారు.

మంథని : బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం, హత్య ఘటనకు నిరసనగా మంథని ప్రభుత్వ సామాజిక వైద్యశాల, మాతాశిశు సంరక్షణ కేంద్రాల్లో వైద్య ఉద్యోగులు శనివారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. సంఘటనకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామగిరి : కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారానికి నిరసనగా మండలంలోని బేగంపేట్ పీహెచ్‌సీలో శనివారం వైద్యులు, సిబ్బంది బ్లాక్ బ్యాడ్జీలు ధరించి నిరసనను తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇక ముందు ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.


మంథనిలో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య ఉద్యోగులు


బేగంపేట్ పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన

ముందస్తు రక్షాబంధన్ వేడుకలు

పాలకుర్తి,అగస్టు 17:మండలం పరిధిలోని జీడి నగర్ యూనివర్సల్ పాఠశాలలో, ఫుట్నూర్ గ్లోబల్ ఇంగ్లీష్ మీడియంలో శనివారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు బుర్ర సత్యంగౌడ్, ఇష్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.


పుట్నూర్‌లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని మల్యాల ఉన్నత పాఠశాలలో శనివారం రక్షాబంధన్ కార్యక్రమం జరిగింది. బాలికలు బాలురకు, మహిళా టీచర్లు ఉపాధ్యాయులకు రాఖీలు కట్టి అన్నాచెల్లెల అనుబంధాలను చాటారు.

ఓదెల : మండల కేంద్రంలోని హైస్కూల్‌తో పాటు, వివిధ గ్రామాల్లో ఉన్న పాఠశాలల్లో శనివారం ముందస్తుగా ఆర్ఎస్ఎస్, బీజేపీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులకు రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో క్యాతం రమేష్, ఉభయ్‌రెడ్డి, మేకల నిఖిల్, శ్రీధర్‌రెడ్డి, మల్లేష్, అరుణ్, సాయితో పాటు పలువురు పాల్గొన్నారు.

రామగిరి : మండలంలోని సెంటినరీకాలనీలో శనివారం బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు ముందస్తు రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. స్థానికంగా ఉన్న వాణి, ప్రగతి, కృష్ణవేణి పాఠశాలల్లో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోల్కూరి శ్రీనివాస్, మహేష్, సందీప్, పాఠశాలల కరస్పాండెంట్‌లు అబ్బు కేశవరెడ్డి, రామ్, తిరుపతిరెడ్డి, బాల శ్రీనివాస్, భూమ్‌రెడ్డి, బుద్దుల తిరుపతి, బర్ల శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : బీజేపీ ఆధ్వర్యంలో శనివారం కాలనీలో రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. షిర్కే, తెలంగాణ చౌరస్తా ఏరియాల్లో వ్యాపారులకు స్థానికులకు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో మూకిరి రాజు, ఆకుల శశి, కొమ్ము గట్టయ్య, దాసరి శ్రీనివాస్, కుమార్, పొట్ల వెంకటేష్, శివరామకృష్ణ, దావ రాజిరెడ్డి, కోటేష్, చంద్రమౌళి పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలి

కోల్‌సిటీ, ఆగస్టు 17: నేరాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములుకావాలని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి సూచించారు. శనివారం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గోదావరిఖని మిలీనియం క్వార్టర్‌లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మహిళలపై జరుగుతున్న నేరాల నియంత్రణ కోసం చర్యలు తీసుకుంటున్నామని, నేరాల నియంత్రణకు ప్రజలు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. మహిళలను అనుమానస్పద ఫోన్‌కాల్స్‌ను లిఫ్ట్ చేయవద్దని, ఎవరికి ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. పిల్లలు గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూసుకోవాలని, మైనర్లకు మోటార్ సైకిళ్లు ఇవ్వవద్దని సూచించారు. ఎవరైనా మహిళలకు ఆపదవస్తే వెంటనే 100నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

క్వార్టర్ల కూల్చివేతపై తప్పుడు ప్రచారం

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 17: క్వార్టర్ల కూల్చివేతపై సింగరేణి యాజమాన్యం తప్పుడు ప్రచారం చేస్తుందని హెచ్ఎంఎస్ నాయకుడు తోట వేణు ఆరోపించారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరిఖనిలో ఇప్పటికే జనాభా సంఖ్య తగ్గిందని, పోచమ్మ మైదానంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌నే వినియోగంలోకి తీసుకురావడం లేదని, కూలిపోతున్న క్వార్టర్లస్థానంలో క్వార్టర్లు నిర్మించి కార్మికులకు ఇవ్వాలని కోరారు.

నూతన గదుల నిర్మాణానికి కృషి

సుల్తానాబాద్, ఆగస్టు 17: సుల్తానాబాద్ పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నూతన గదుల నిర్మాణం కోసం కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు అన్నారు. శనివారం ఆమె పాఠశాలను సందర్శించారు. గదుల నిర్మాణం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గాజుల అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆర్జీ-3 డిస్పెన్సరీలో వైద్య పరీక్షలకు తప్పని అవస్థలు

రామగిరి, ఆగస్టు 17: సింగరేణి ఆర్జీ-3 డిస్పెన్సరీలో వైద్య పరీక్షలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం వివిధ రకాల వ్యాధులతో డిస్పెన్సరీ వైద్యం కోసం వస్తున్న కార్మికులు అవస్థలు పడుతున్నారు. వారం రోజులుగా జ్వరంతో వైద్య పరీక్షలకు డిస్పెన్సరీకి వస్తున్న కార్మికులకు గంటల పాటు వేచి చూసే పరిస్థితి నెలకొంది. డిస్పెన్సరీకి ఒక్క వైద్యుడే విధులు నిర్వహిస్తుండడంతో నిత్యం వందకు పైగా ఓపీ నమోదు అవడంతో డిస్పెన్సరీలో క్యూలైన్‌లో కార్మికులు జ్వరంతో బాధపడుతూ నిల్చునే పరిస్థితి నెలకొంది. వైద్య పరీక్షలు జాప్యం కావడంతో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్నారు. కాలనీలో జ్వరాలు విజృంభిస్తుండడంతో బాధితుల సంఖ్య గణనీయంగా పెరిగిపోతుంది. అందుకు అనుగుణంగా డిస్పెన్సరీలో అదనంగా వైద్యులను ఏర్పాటు చేయడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్క వైద్యుడితోనే యాజమాన్యం పని కానిస్తుండడంతో కార్మికుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. డిస్పెన్సరీలో కనీసం కూర్చోవడానికి వసతులు సైతం ఏర్పాటు చేయకపోవడంతో ఓపీ పేషెంట్‌ల బాధ వర్ణనాతీతంగా మారింది. ఆర్జీ-3 డిస్పెన్సరీలో కనీసం నెల రోజుల పాటు అదనంగా డాక్టర్‌ను ఏర్పాటు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్లేడేల విషయంలో కార్మికులకు అన్యాయం

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 17: ప్లేడేల విషయంలో ఓసీపీ-3 యాజమాన్యం కార్మికులకు అన్యాయం చేస్తున్నదని టీబీజీకేఎస్ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ ప్రకటనలో పేర్కొన్నారు. గత మూడు నెలలుగా వర్షాలు లేని సమయాల్లో కూడా వర్షాన్ని సాకుగా చూపుతూ రెండు ప్లేడేలకు పరిమితం చేస్తున్నట్టు తెలిపారు. దీంతో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నట్టు తెలిపారు. వారం రోజులు నిరంతరాయంగా ఉత్పత్తిలో నిమగ్నమైన కార్మికులకు వారాంతపు సెలవు దినంలో ప్లేడే కల్పించాల్సిన బాధ్యతను ఓసీపీ-3 యాజమాన్యం విస్మరించినట్టు తెలిపారు. వారం రోజులు అధిక ఉత్పత్తి చేయాలని కార్మికులపై అధిక భారం మోపుతూ అనుకున్న ఉత్పత్తి సాధించిన తర్వాత ప్లేడేలు ఇవ్వకుండా మొండి చేయి చూపుతున్నదని అన్నారు. ఓసీపీ-3 యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా ప్లేడేలు తగ్గిస్తున్నట్టు తెలుస్తున్నదని, ఇదే ధోరణి అవలంభిస్తే కార్మికుల్లో అసంతృప్తి నెలకొని ఉత్పత్తిపై ప్రభావం చూపే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. గతంలో మాదిరి ప్లేడేలను ఇవ్వాలని యాజమాన్యాన్ని అయిలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

బీటెక్ సూపర్ న్యూమరరీ సీట్ల భర్తీకి చివరి కౌన్సెలింగ్

రామగిరి, ఆగస్టు 17: మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో 2024-25 సంవత్సరానికి సింగరేణికి కల్పించిన సూపర్ న్యూమరరీ సీట్ల ప్రవేశానికి చివరి కౌన్సెలింగ్‌ను ఈనెల 20న నిర్వహించనున్నట్లు శనివారం ఆర్జీ-3, ఏపీఏ జీఎం సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. మొదటి దశ కౌన్సెలింగ్‌లో మిగిలిన 25 ఖాళీ సీట్ల భర్తీకి సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టినట్లు పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు కళాశాల ప్రాంగణంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సుల్తానాబాద్‌లో రుణమాఫీ సంబరాలు


రుణమాఫీ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు


సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

సుల్తానాబాద్, ఆగస్టు 17: తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి తను ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ అమలు చేశారని ఇది దేశంలోనే ఒక చరిత్రగా నిలుస్తుందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో రుణమాఫీ సంబరాలను శనివారం జరుపుకున్నారు. స్థానిక ఐబీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికి బాణసంచా పేల్చి స్వీట్లు పంచారు. కాంగ్రెస్ జెండాలతో అలంకరించిన ట్రాక్టర్‌ను ఎక్కి స్వయంగా దాన్ని నడుపుకుంటూ ఎమ్మెల్యే రుణమాఫీ సంబరాలను ప్రారంభించారు. రాజీవ్ రహదారి మీదుగా ర్యాలీ వైశ్యాభవన్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రుణమాఫీ గురించి వరంగల్ డిక్లరేషన్ ప్రకటించారని దీన్ని గుర్తు చేస్తూ ఇచ్చిన హామీ మేరకు రైతుల రుణమాఫీ చేశామన్నారు. కొంత మంది రైతులకు సాంకేతిక కారణాల వలన రుణ మాఫీ జరగలేదని అయినా వారు ఎలాంటి ఆందోళన చెందవలసని అవసరం లేదని, వారి కోసం కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్‌లైన్ పెట్టారని, అధికారులు ఆయాగ్రామాలకు వచ్చి రుణమాఫీ జరగని రైతుల వివరాలు నమోదు చేసుకుని వారికి రుణమాఫీ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటారని రైతులకు భరోసా ఇచ్చారు. రుణమాఫీ సంబరాలలో సీనియర్ నాయకులు మినుపాల ప్రకాశరావు, అంతటి అన్నయ్య గౌడ్, పన్నాల రాములు, శ్రీగిరి శ్రీనివాస్, సాయిరి మహేందర్, రాజలింగం, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, జానీ, పులి వెంకటేశం, పోచాలు, సంతోష్ రావు, నన్ను, రాజు, రాజయ్య, రఫీ, చంద్రయ్య, అంజయ్య, నోముల శ్రీనివాస్‌రెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

సుల్తానాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం ఎమ్మెల్యే విజయరమణారావు పంపిణీ చేశారు. స్థానిక వైశ్య భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన 236 మందికి ఆరవై లక్షల రూపాయల విలువగల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాజులు లక్ష్మి రాజమల్లు, వైస్‌చైర్ పర్సన్ బిరుదు సమత క్రిష్ణ, పలువురు కౌన్సిలర్లతో పాటు మండల నాయకులు, తహసీల్దార్ మదుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మినుపాల స్వరూప ప్రకాశ్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, వైస్‌చైర్ పర్సన్ బిరుదు సమత క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ : కలెక్టర్

పెద్దపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ కోసం జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీని కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, చెరువు శిఖం భూములు మొదలగు ఆస్తులు ఆక్రమణలకు గురి కాకుండా సంరక్షించడానికి కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీలో అదనపు కలెక్టర్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, అదనపు కలెక్టర్(రెవెన్యూ), జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి, సహాయ సంచాలకులు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్, పెద్దపల్లి ఆర్డీవో, మంథని ఆర్డిఓ, ప్రభుత్వ ఆస్తి జ్యూరీడిక్షన్ ఉన్న తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ కమిటీ సభ్యులుగా ఉంటారని, కలెక్టరేట్ ఈ విభాగం సూపరింటెండెంట్ కమిటీ కన్వీనర్‌గా పని చేస్తారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ భూములు, చెరువులు, శిఖం భూములు, కుంటలను ఆక్రమణల నుంచి సంరక్షించేందుకు జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ పనిచేస్తుందని, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించుకొని నిర్మించే నిర్మాణాలను సకాలంలో తొలగించడం జరుగుతుందని, ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు కమిటీ పనిచేస్తుందని, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలపై వచ్చే ఫిర్యాదులకు ఎప్పటికప్పుడు స్పందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణలపై ఇకనుంచి ఎవరైనా నేరుగా dropeddapalli@gmail.com మెయిల్ ఐడీ లేదా ఫోన్ నెంబర్ 9491479020 నందు ఫిర్యాదు నమోదు చేయాలని పేర్కొన్నారు. అధికారులు స్పందించి సదరు అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రభుత్వ ఆస్తులను సంరక్షిస్తామని తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలి

-డీసీపీ అడ్మిన్ సి.రాజు


జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

పెద్దపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణను అలవర్చుకొని చదువులో రాణించాలని డీసీపీ అడ్మిన్ సి.రాజు అన్నారు. శనివారం పెద్దపల్లిలోని నందన గార్డెన్‌లో ఐఎఎస్ అధికారి పరికిపండ్ల నరహరి వ్యవస్థాపకులుగా ఏర్పడ్డ ఆలయ ఫౌండేషన్, ఇంపాక్ట్ ఫౌండేషన్ సీఈఓ టిట్లా రమేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీసీపీ రాజు మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడికతో చదువుకుంటూ ఉన్నత శిఖరాలకు ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు మహిళల పట్ల గౌరవంతో ఉండాలన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మోటివేషనల్ స్పీకర్ గంప నాగేశ్వరరావు మాట్లాడుతూ మెమరీ టిప్, గోల్ సెట్టింగ్, టైం మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి సుమారు 800 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీఈవో మాధవి, ఫౌండేషన్ సభ్యులు మిట్టపల్లి రాజేంద్రకుమార్, కీర్తి నాగార్జున, పరికిపండ్ల రామ్, మల్క రామస్వామి, మహేష్ పటేల్, సతీష్, అనిల్, దయానాథ్, శేఖర్, ఫౌండేషన్ వలంటీర్స్ పాల్గొన్నారు.

బాధితుడికి బాల్య మిత్రుల ఆర్థిక సహాయం

గోదావరిఖని, ఆగస్టు 17: క్యాన్సర్‌తో బాధపడుతున్న బాల్య మిత్రుడికి తోటి స్నేహితులు ఆర్థిక సహాయం అందజేశారు. రామగుండంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1986-87 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు క్యాన్సర్‌తో బాధపడుతున్న బాల్యమిత్రుడు లింగాపూర్ గ్రామానికి చెందిన గుండు కనకయ్యకు శనివారం రూ.లక్షా 3వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో భాగ్యనగరం రాజబాబు, కందుల పోచం, రమేష్, సలీం, ఎం.శ్రీనివాస్, కె.సత్యనారాయణ, అబ్దుల్, హఫీజ్, నరసింగరావు, జోసెఫ్,మల్లేష్, మోయినోద్దిన్, భూమేష్, రవీందర్, సత్యనారాయణ, గట్టయ్య, శ్రీనివాస్, సారయ్య,ఉప్పల్‌రావు, మొహ్మద్దిన్, వెంకటేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

రామగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రంగా ప్రకటించాలి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 17: రామగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రంగా ప్రకటించాలని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కుల సురేష్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రానికి 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రంగా ప్రకటించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 12వ శతాబ్దంలో కాకతీయుల కాలంలో రామగిరి కొండపై నిర్మించిన కోట వారి శిల్ప సాంస్కృతిక సంపదకు తార్కాణంగా నిలుస్తుందన్నారు. గొప్ప సంస్కృత కవులలో ఒకరైన కాళిదాసు, రామగిరి కోట ద్వారా మేఘదూత గేయ పద్యాన్ని రచించారని వివరించారు. రామాయణ కావ్యంలో సైతం రామగిరి కోట ప్రస్తావన ఉందని పేర్కొన్నారు. కోట ప్రాంతంలో పెద్దసంఖ్యలో ఔషధ మొక్కలు ఉన్నాయన్నారు. ఔషద మొక్కల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ అడవిని ఔషధమొక్కల సంరక్షణ కేంద్రంగా ప్రకటించాలని సూచించారు. నిత్యం ఖిల్లా మీదుగా ప్రయాణించే మంత్రులకు ఇది కనిపించడం లేదా అని ప్రశ్నించారు. చారిత్రక కట్టడాల పరిరక్షణ అంశంలో కేంద్రంలోని బీజేపీ సర్కారు సానుకూలంగా ఉందన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిస్తే జాతీయ కట్టడాల పరిరక్షణ జాబితాలో రామగిరిఖిల్లాకు స్థానం లభిస్తుందని ఆయన తెలిపారు.

విద్యార్థులు ప్రణాళికతో ముందుకు సాగాలి


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో మాధవి

మంథనిరూరల్, ఆగస్టు 17: విద్యార్థులు ప్రణాళికతో ముందుకు సాగాలని జిల్లా విద్యాధికారి మాధవి సూచించారు. మంథని మండలంలోని కన్నాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈవో శనివారం సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనాన్ని అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రతి మూడో శనివారం నిర్వహించే ఈసమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని పిల్లల చదువు గురించి తెలుసుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు కానుగంటి శ్రీనివాస్, రాజు, రాధిక, సావిత్రి, శ్రీలత, సంపత్, మధు, రాధ, విద్యా కమిటీ చైర్మన్ రమలు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా తిరుమల్‌రావు

సుల్తానాబాద్, ఆగస్టు 17: జిల్లా సీనియర్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుల్తానాబాద్ మండలం నర్సయ్యపల్లి గ్రామానికి చెందిన తిరుమల్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మండలంలోని గర్రెపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు తిరుమల్‌రావును సన్మానించారు. గ్రామంలో క్రీడాకారుల కోసం పది వేల రూపాయల విలువ గల రెండు వాలీబాల్ నెట్లు, రెండు బాల్స్, రెండు పోల్స్ అందజేశారు. కార్యక్రమంలో జాతీయ వాలీబాల్ క్రీడాకారులు కన్న రమేష్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘ మండల అధ్యక్షులు ఆసరి రాజయ్య, నాయకులు పోచంపల్లి బక్కయ్య, రమేష్, ప్రసాద్, మల్లేశం, కుమార్, స్వామి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

-డీఎల్‌పీవో కొమ్మెర సతీష్


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సతీష్

కమాన్‌పూర్, ఆగస్టు17: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై గ్రామ పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పారిశుధ్య సిబ్బందితో పని చేయించాలని మంథని డీఎల్‌పీవో కొమ్మెర సతీష్ అన్నారు. మండలంలోని గుండారం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. మురుగు కాలువల వెంబండి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలన్నారు. ఆయన వెంట ఎంపీవో కాటం భాస్కర్, కార్యదర్శి ప్రసాద్, కారోబార్ రాచకొండ బీమరాజులు ఉన్నారు.